# 10

# శక్తి, గ్రహింపుశక్తి, మరియు సంపూర్ణత కొరకు ప్రార్థన

## (3:14-21)

ఆయన అన్యజనుల మధ్య చేయుచుండిన తన పరిచర్య, దేవుని సంకల్పమును నెరవేర్చుటకు సంఘం వహించాల్సిన పాత్ర, మరియు క్రీస్తు సందేశమును విని దానిని అంగీకరించినవారు దేవుని సమీపించుటకు ఆనందంగా అనుభూతి చెందుచుండిన అనుకూలమైన అందుబాటు గూర్చి పౌలు ఆలోచిస్తూ, పౌలు దేవుని విన్నవించుకొన్నాడు.

### ముందు మాట (3:14)

**14ఈ హేతువు చేత పరలోకమునందును, భూమి మీదను ఉన్న ప్రతి కుటుంబము ఏ తండ్రినిబట్టి కుటుంబమని పిలువబడుచున్నదో ఆ తండ్రి యెదుట నేను మోకాళ్లూని ...**

**వచనము 14.** బయలుపరచబడిన మర్మము యొక్క ఉద్దేశము నెరవేరుటకు ప్రత్యుత్తరమీయబడిన ప్రార్థనలు అవశ్యకమై యున్నవి. అనగా, వారు ఒక సంఘముగా ఏమై యుండవలెనని దేవుడు కోరుచుండెనో అదంతా అయియుండుటకును, వారు ఏమేమి చేయవలెనని దేవుడు కోరుచుండెనో అదంతా చేయుటకును ఎఫెస్సు పట్టణంలోని క్రైస్తవులకు దేవుని బలము మరియు నేతృత్వము అగత్యమై యుండినవి. **ఈ హేతువు చేత** అను మాటలు మర్మము గూర్చి పౌలు చెప్పినదానంతటిని సూచిస్తూ, మొదటి వచనంలో వ్రాయబడియున్న అవే మాటలను మనకు గుర్తుచేస్తున్నాయి. మొదటి వచనంలో, ఇచ్చటి వలెనే, దేవుని ప్రణాళికలో భాగమై యుండినవారికి ప్రసాదింపబడిన గొప్ప ప్రత్యేకార్హతల గూర్చి పౌలు మాటలాడాడు. 3:14–21లో గల ప్రార్థన, సంఘమునకు దేవుని చేత అప్పగింపబడిన కార్యభారమును నెరవేర్చు నిమిత్తమై ఆయన సంఘమునకు అధికారం యివ్వవలెనని పౌలు చేయుచుండిన ఒక మనవియై యున్నది.

**నేను మోకాళ్లూని** అను మాటలు వినయముతో కూడిన మరియు మరొకరిపై ఆధారపడుచున్న ఒక వైఖరిని వ్యక్తము చేయుచున్నవి. ఈ ప్రార్థనలో పౌలు అనుకరించుచుండిన అంగ విన్యాసము హృదయ వైఖరి అయియున్నంత ముఖ్యమయ్యింది కాదు. ప్రార్థనలు చేయుచుండినప్పుడు ప్రజలు ప్రదర్శించిన నానా విధములైన అంగ విన్యాసములు బైబిలులో పేర్కొనబడి యున్నవి, ఉదా॥ నిలువబడియుండుట (మార్కు 11:25; లూకా 18:11, 13), మోకాళ్లూనుట (1 రాజులు 8:54; దాని 6:10; లూకా 22:41; అపొస్తలుల కార్యములు 7:60; 20:36; 21:5), మరియు సాష్టాంగపడుట

(మత్తయి 26:39).

**యెదుట** అను పదము (*pros*) అను గ్రీకు ఉపసర్గ మాట యొక్క అనువాదమై యున్నది, "వైపు/దిశగా, *అక్షరార్థము మరియు మానసికమునైన దిశ*" అని దీని అర్థము.[1] పౌలు తన ముఖమును **తండ్రి** వైపు మళ్లించి ఉంచాడు. ఇదే ఉపసర్గ పదము యేసు "దేవుని యొద్ద" ఉండెనని చెప్పబడుచున్న యోహాను 1:1లో ఉపయోగింపబడింది. దేవుడు "తండ్రి" యని ఎఫెసీ పత్రికలోని అనేక వాక్యభాగాల్లో ప్రస్తావింపబడుచున్నాడు (1:2, 3, 17–19; 2:18; 4:6; 5:20; 6:23 చూడుము). దేవుడు, యేసు క్రీస్తు యొక్క తండ్రీ, పౌలు మరియు ఎఫెసీ క్రైస్తవులకు కూడ తండ్రియై యుండెను.

ఒక **కుటుంబమని** పిలువబడదగు **పరలోకమందలి మరియు భూలోకమందలి** ప్రతి సంబంధము **దాని పేరును** దేవుని నుండి పొందుచున్నది. అందరును "దేవునిసంతానమై" యున్నారను విశాల దృక్పథంలో (అపొస్తలుల కార్యములు 17:28 చూడుము) ఇది పరలోకమందలి దేవదూతలను మరియు ఇహలోకమందలి యూదులు మరియు అన్యజనులను సూచింపవచ్చును. ఖచ్చితమైన అవగాహన ప్రకారం, క్రైస్తవులు మాత్రమే దేవుని కుటుంబములోని సభ్యులై యున్నారని మనము అర్థంచేసుకొనుచున్నాము. పౌలు సృష్టికర్త, ప్రభువు, మరియు విమోచకుడునై యున్న దేవునికి ప్రార్థించాడు.

### పరిశుద్ధాత్మ మరియు క్రీస్తు శక్తి కొరకైన విన్నపము (3:15–18ఏ)

**15–18ఏ... మీరు అంతరంగ పురుషుని యందు శక్తి కలిగి ఆయన ఆత్మ వలన బలపరచబడునట్లుగాను, క్రీస్తు మీ హృదయములలో విశ్వాసము ద్వారా నివసించునట్లుగాను, 18ఏతన మహిమైశ్వర్యము చొప్పున, మీకు దయచేయవలెననియు ...**

**వచనములు 15–18ఏ.** పౌలు ఎఫెసీయుల విషయంలో మూడు విన్నపములు చేసాడు. ప్రతి విన్నపము **గాను** లేక **అనియు** అను అర్థమిచ్చు సముచ్చయముతో (*hina*) ముగియుచు, *"ఉద్దేశము, లక్ష్యసాధన నిమిత్తము అవలంబించే మార్గము, మరియు ఫలితము"* అను ధ్వనింపు నిచ్చుచున్నది.[2] పౌలు విన్నవించుకొన్న మనవులనుబట్టి చూస్తే, ఆయన చేసిన ప్రార్థనలో మూడు ఉద్దేశములుండినవని అర్థమగుచున్నది. తాను చేయుచుండిన మానవులను దేవుడు **తన మహిమైశ్వర్యము చొప్పున** వారికి **దయచేయవలెనని** పలుకుచు పౌలు తన ప్రార్థనను ప్రారంభించాడు. నిశ్చయమైన కొన్ని ఆశీర్వాదాలను "మహిమ స్వరూపియగు తండ్రి" ఎఫెసీయులకు "అనుగ్రహించునట్లు" అని ఆయన అంతకు మునుపు 1:17–19లో చేసిన ప్రార్థనలోని విషయాలను ఈ మాటలు జ్ఞప్తికి తెచ్చుచున్నవి. మనముందున్న వాక్యభాగములో, పౌలు "ఇవ్వవలెనని" అనుటకు బదులుగా "దయచేయవలెనని" అను ఈ మాటను ప్రయోగించాడు; కానీ రెండు సందర్భాల్లోను "మహిమ" అను మాటను ఉపయోగించాడు. "తన మహిమైశ్వర్యము చొప్పున" అను పదజాలమును ప్రయోగించుట సమృద్ధియైన దేవుని శక్తిని ప్రస్తావించుటకు పౌలు ఎన్నుకొనిన పద్ధతై యుండింది. ఇదే విధమైన పదజాలములు రోమీయులకు 9:23, 24, ఫిలిప్పీయులకు 4:19, మరియు కొలొస్సయులకు 1:27లో అగుపిస్తాయి. రోమీయులకు 6:4లో, "తండ్రి మహిమ వలన క్రీస్తు

మృతులలో నుండి లేపబడినాడని" చెప్పిన సందర్భములో దేవుని "శక్తిని" సూచించుటకు పౌలు "మహిమ" అను పదాన్ని ప్రయోగించాడు. ఎఫెసీయులకు 1:20–21లో యేసు క్రీస్తు దేవుని బలాతిశయము చేత లేపబడినాడని పౌలు సెలవిచ్చాడు.

8–11 వచనాల్లో ఘోషింపబడిన కార్యభారమును ఎఫెసీయులు నెరవేర్చునట్లు, వారి అంతరంగమందు వారిని **బలపరచుటకు** దేవుని అపరిమితమైన **శక్తి** పరిశుద్ధాత్మద్వారా స్వేచ్ఛగా విడుదల చేయబడవలెనని పౌలు ప్రార్థించాడు. పౌలు ప్రార్థించిన బలము **ఆయన ఆత్మ** వలన, అనగా రాబోవు యుగములో వారిదై యుండి వారి నిండైన స్వాస్థ్యమునకు (1:13, 14) అభయముగా ఎఫెసీయులకు ముద్రవేయబడిన దేవుని పరిశుద్ధాత్మ వలన అనుగ్రహింపబడవలసినదై యుండింది. దేవుడు సంఘములో నివసించుటకు పరిశుద్ధాత్మ ఒక తెరువై యున్నాడు (2:22). **అంతరంగ పురుషుడు** అను పదజాలము క్రైస్తవునిలోని దేవునితో సంబంధము కలిగియున్న భాగమును గుర్తిస్తుంది. అది "మనము దేవుని ధర్మశాస్త్రమునందు ఆనందించుటకు" (రోమీయులకు 7:22) మనలను అనుమతించు మానవునిలోను భాగమై యున్నది, మరియు అది "దిన దినము నూతనపరచబడుట వలన" (2 కొరింథీయులకు 4:16) మనస్సు "మారుట ద్వారా రూపాంతరము చెందుచుండును" రోమీయులకు 12:2). "అంతరంగ పురుషుడు" క్రీస్తునందు దేవుని నూతన సృష్టిగా మనస్సు యొక్క "చిత్తవృత్తి యందు నూతనపరచబడుచున్నాడు" (ఎఫెసీయులకు 4:23, 24; 2 కొరింథీయులకు 5:17 చూడుము). దేవుని సారూప్యం లోనికి ఎదుగుచున్నది, అది ఆధ్యాత్మిక స్వయం అయి యున్నది (కొలొస్సయులకు 3:9, 10) గనుక దేవుడు సంఘం విషయంలో అప్పగించిన సదుద్దేశమును నెరవేర్చునట్లు బలపరచబడుట ఆవశ్యకమై యున్నది.

పౌలు తన తొలి విన్నపమును కొనసాగిస్తున్నాడు: **క్రీస్తు** [వారి] **హృదయములలో నివసించునట్లు** ఎఫెసీయులు వారి అంతరంగ పురుషుని యందు దేవుని ఆత్మ శక్తితో బలపరచబడాలని ఆయన ప్రార్థించాడు. "నివసించుట" అను అర్థమిచ్చు పదము (*katoikeō*) (*oikeō*, "ఒక గృహములో నివసించుచున్నట్లు నివసించుట") మరియు (*kata*, "లో") అను రెండు పదములు కలిసియున్న మిశ్రమ మాటయై, "సౌకర్యవంతంగా బస ఏర్పరచుకొని సొంత ఇంటిలో నివసించుచున్న అనుభూతిని అనుభవించుట" అను భావమును కలుగజేయుచున్నది.[3] పరిశుద్ధాత్మ "అంతరంగ పురుషుని యుందును" మరియు క్రీస్తు "మీ హృదయములలోను" అంటూ పౌలు మాటలాడుచున్నాడు. హృదయము మానవునిలో భాగమైయున్న "అనుభూతులు, ఆలోచనలు, ఇష్టపడుట" మొ॥ వాటికి కేంద్రమై యుండి[4] "అంతరంగ పురుషునికి" సమానార్థము నిచ్చుచున్నది. పరిశుద్ధాత్మ క్రైస్తవుల "అంతరంగ పురుషునిలో" నివసించుచున్నట్లుగా, క్రీస్తు వారి "హృదయములలో" నివసిస్తాడు. గనుక క్రైస్తవులు ఒకరిని కలిగియున్నట్లయితే, రెండవ వ్యక్తిని సహితము కలిగియున్నట్లే యని అర్థము. పౌలు అంతకు మునుపు సంఘము గూర్చి మాటలాడుచూ అది "ఆత్మ మూలముగా దేవునికి నివాస స్థలము" అని ప్రస్తావించాడు (2:22). కాబట్టి, సంఘము, దేవుని ప్రజల సమూహమై యున్న జీవియై, దేవుడు, క్రీస్తు, మరియు పరిశుద్ధాత్మ నివసించు చోటై యున్నది. అంతరంగములో నివసించు పరిశుద్ధాత్ముని శక్తి, యేసు శీలము ప్రతి క్రైస్తవుని జీవితములో ఒక బండగురుతై యుండునట్లు చేయవలెనని పౌలు ప్రార్థించుచుండెను.[5]

**క్రీస్తు** క్రైస్తవుని హృదయములో **విశ్వాసము ద్వారా** నివసిస్తాడు. అతడు పరిశుద్ధాత్మ చేత తన అంతరంగ పురుషునిలో బలపరచబడుచున్నాడనియు, వాని హృదయములో క్రీస్తు నివసించుచున్నాడనియు క్రైస్తవుడు ఎలా తెలిసికొంటాడు? విశ్వాసము ద్వారానే. వాడు ఈ సత్యములను అంగీకరిస్తాడు ఏలయనగా ఈ విషయాలను దేవుడు సెలవిచ్చాడు మరియు అవి జరుగుచుండునట్లు అనుమతించువాడు ఆయనే. విశ్వాసము ద్వారానే ఇది జరగును. ఎఫెసీయులు రక్షణను స్వీకరించుటకును (2:8), దేవుని యొద్దకు చేరుటకును (3:12) విశ్వాసము ఒక మఖ్యమైన మూలాంశమై యుండింది. క్రీస్తు వారి హృదయములలో నివసించుట వారికొక వాస్తవమై యుండుటకు విశ్వాసము ఒక విశాలమైన వీధి మార్గముగా కూడ ఉండింది. సంఘము దాని కర్తవ్యమును నెరవేర్చుటలో సఫలీకృతమగునట్లు, అంతరంగములో నివసించు పరిశుద్ధాత్మ మరియు క్రీస్తు వారికప్పగింపబడిన కార్యభారమును సాధించుటకవసరమైన బలమును సమకూర్చు వాటిని సభ్యులు విశ్వాసముతో అంగీకరించవలసి యుండింది.

## క్రీస్తు ప్రేమను అర్థంచేసుకొనుట కొరకైన విన్నపము (3:18, 19)

**18... మీరు దేవుని సంపూర్ణతయందు పూర్ణులగునట్లుగా, ప్రేమయందు వేరు పారి స్థిరపడి, సమస్త పరిశుద్ధులతోకూడ దాని వెడల్పు పొడుగు లోతు ఎత్తు ఎంతో గ్రహించుకొనుటకును, 19జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలిసికొనుటకును తగినశక్తిగలవారు కావలెననియు ప్రార్థించుచున్నాను.**

**వచనములు 18, 19.** పౌలు చేసిన రెండవ విన్నపము కూడ **గాను** లేక **అనియు** అను అర్థమిచ్చు *hina* అను సముచ్ఛయ పదముతో ముగియుచున్నది. **వేరు పారి యుండుట** అనగా భద్రముగా నాటబడియుండుట అని అర్థము, మరియు **స్థిరపడి** అనగా గట్టి “పునాది” యను అభిప్రాయమును తెలియజెప్పుచున్నది.[6] **ప్రేమ** అనునది క్రైస్తవుడు గట్టిగా నాటబడినవాడై యుండాల్సిన నేల మరియు వాని శేష జీవితం దానిపై కట్టబడవలసి యున్న పునాదియై యున్నది. ఇటువంటి వాంగ్మూలము, విశ్వాసులు “క్రీస్తునందు వేరుపారినవారును ... కట్టబడుచున్నవారునై” యున్నారని చెప్పుచు పౌలు కొలొస్సయులకు వ్రాసిన పత్రికలో కూడ అగుపిస్తుంది (2:6, 7). ఈ ప్రేమకు మూలాధారము క్రీస్తే.

క్రైస్తవులు ఏదో ఒకటి, ఏదో ఒక సత్యమును **గ్రహించగలుగుదురని** (*katalambanō*) అనగా, “కైవశము చేసికొనుట, పట్టుకొనుట, *ఆసక్తితో ... మనస్సులో* బంధించుట ... అనుభవ పూర్వకంగా తెలుసుకొనుట”[7] – పౌలు ప్రార్థించాడు. ఎఫెసీయులు ఏ యే విషయాలు గ్రహించవలసి యుండినదో యను అంశము గూర్చి వివరణాత్మక వివరములను తెలియజెప్పువారి చేత నానావిధ అభిప్రాయాలు సూచింపబడినవి.[8] ఏది ఏమైనా, వారికప్పగింపబడిన కార్యభారమును వారు ప్రేమ పూర్వకంగా నెరవేర్చునట్లు ప్రోత్సాహింపబడాలని పౌలు ఆశించాడని సందర్భం సూచిస్తుంది. 15–18 వచనాల్లో, వారు “ప్రేమ యందు వేరు పారి స్థిరపడాలనియు,” 19వ వచనంలో, వారు “క్రీస్తు ప్రేమను తెలిసికొనవలెననియు” పౌలు ఆశిస్తున్న విషయాన్ని సెలవిస్తున్నాడు. వారి కార్యభారమును నెరవేర్చుటకు అవసరమై యున్న శక్తి వారి అంతరంగములో నివసించు పరిశుద్ధాత్మ

మరియు క్రీస్తె యుండిరి, మరియు వారి కార్యభారమును నెరవేర్చుటకు అవసరమైయుండిన ప్రోత్సాహకము ప్రేమయై యుండింది. సరైన దానినే చేయుటకు అవసరమై యుండిన ఉన్నతమైన ప్రోత్సాహకము దోషభావము, భయము లేక ఘనత కోసమైన కోరిక మొ॥ కాదు, కానీ ప్రేమయే. ఈ వాక్యభాగములో, పౌలు ప్రేమ యొక్క నాలుగు పరిమాణములను పేర్కొనుచున్నాడు:

**వెడల్పు.** మానవుని యెడల గల దైవీకమైన ప్రేమ సమస్త మానవాళి కంటెను సువిశాలమైనదై యున్నది. గనుక మానవులు ఏ ఒక్కరైనను మినహాయింపబడలేదు.

**పొడవు.** దేవుని ప్రేమ విస్తరించగల దూరమునకు పరిమితి లేదు.

**ఎత్తు.** దైవీకమైన ప్రేమ క్రైస్తవుడు దేవుని కుటుంబములో ఒక భాగమై యుండి పరలోక నిరీక్షణ కలిగియుండునట్లు వానిని ఉన్నత స్థాయికి లేవనెత్తుతుంది.

**లోతు.** నశించిన వారిని వెదకి రక్షించుటకు దేవుని ప్రేమ పాపము యొక్క ఊబి లోతుల్లోని అట్టడుగు భాగానికి సహితము చేరుకొంటుంది.

దేవుడు సంఘము గూర్చి కలిగియున్న ఉద్దేశమును ఎఫెసీయులు నెరవేర్చుటకు వారు దేవుని ప్రేమను గ్రహించగలిగినట్లయితే – దానిని కొలుచుటకైనా – వారు ప్రేమ చేత (అనగా, వారి యెడల క్రీస్తుకున్న ప్రేమ మరియు క్రీస్తు యెడల వారికున్న ప్రేమ చేత) ప్రోత్సాహింపబడుటకు నేర్చుకొనగలరని పౌలు విశ్వసించాడు. వారు **క్రీస్తు ప్రేమను తెలిసికొనవలెనని** ఆయన ఆశించాడు. "తెలిసికొనుట" అని అర్థమిచ్చు పదము *gnōsis*కు సంబంధించినదై యున్నది, ఇది "గుర్తించుట ... ఎరుగుట లేక గ్రహించుట"తో సంబంధము గలదై యున్నది.[9] వారు క్రీస్తు ప్రేమను గూర్చి ఉత్తమమైన అవగాహన కలిగియుండవలెనని పౌలు వారి కోసం ప్రార్థించాడు. దేవునికి మన యెడల గల ప్రేమ మరియు క్రీస్తునకు మన యెడల గల ప్రేమ "ఒకే నాణెము యొక్క రెండు వైపులై యున్నవని" పౌలు భావించుచుండెను.[10] "క్రీస్తు ప్రేమ నుండి మనలను ఎడబాపువాడెవడు?" అని పౌలు తాను రోమీయులకు వ్రాసిన పత్రికలో ప్రశ్నిస్తూ (రోమీయులకు 8:35), "మన ప్రభువైన క్రీస్తు యేసు నందలి దేవుని ప్రేమ నుండి మనలను ఏదియు ఎడబాపనేరవని" దానికి సమాధానం కూడా చెప్పుచున్నాడు (రోమీయులకు 8:38, 39). పౌలు అంతకు ముందు దేవుని "మహా ప్రేమ" గూర్చి చెప్పి (2:4) ఆ తరువాత "క్రీస్తు కూడ మిమ్మును ప్రేమించాడని" నొక్కివక్కాణిస్తున్నాడు (5:2). దేవుని ప్రేమ మరియు యేసు క్రీస్తు ప్రేమ విడదీయబడజాలనివని ఆయన పరిగణించాడు.

ఎఫెసీయులు క్రీస్తు ప్రేమను తెలిసికొనవలెనని పౌలు వారి కొరకు ప్రార్థించాడు, కానీ వెనువెంటనే, **జ్ఞానమునకు మించిన** అను మాటలను చేర్చాడు. విశ్వాసి, కొంత మేరకు, "దాని వెడల్పు మరియు పొడవు మరియు ఎత్తు మరియు లోతు" ఎంతో యని మనస్సు లగ్నం చేసి మననం చేయుట ద్వారా దేవుని ప్రేమ యొక్క అపారమును గూర్చిన సత్యమును "తెలిసికొనగలడు"; కానీ సంబంధిత సంపూర్ణ అవగాహన మానవ సామర్థ్యమునకు ఆవల ఉన్నది. "మించిన" అను మాట huperballō యొక్క ఒక అసమాపక క్రియావిశేషణ పద రూపమును అనువదించుచున్నది, "ఆవలకు విసరివేయు, అధిగమించు,

మించు, మేటి అగు" అని అది అర్థమిచ్చుచున్నది.[11] మనము దాని గూర్చి ఎంతగానో తెలిసికొనవలెనని ఆశిస్తున్న క్రీస్తు ప్రేమ మన సంపూర్ణ జ్ఞానమునకు సహితము అంతు చిక్కని పరిమితికి ఆవల ఉన్నదని కనుగొనబడింది. అది "దాని లోతు ఎన్నటికినీ కదిపి చూచి కనుగొనబడలేనంతగా ఎంతో గంభీరమైనదై యున్నది, దాని విస్తృతి మానవ మనస్సు చేత ఎన్నటికినీ పరివేష్టింపబడజాలనంతగా విశాలమైనదై యున్నది."[12]

## దేవుని సంపూర్ణత కొరకైన విన్నపము (3:15-18)

**15-18మీరు దేవుని సంపూర్ణత యందు పూర్ణులగునట్లుగా ...**

**వచనములు 18.** పౌలు ఎఫెసీయుల కోసం చేసిన మూడవ విన్నపములో, **గాను** లేక **అనియు** అను అర్థమిచ్చు *hina* అను సముచ్చయ పదమున్నదని మనము మరొక పర్యాయము చూడనగును. "మీరు దేవుని సంపూర్ణతలో నిండుగా నింపబడునట్లు" అనునది ఈ వచనములలోని ఈ భాగము యొక్క అక్షరార్థ అనువాదమై యున్నది. మనము దేవుని ఆశీర్వాదముల వశమగునప్పుడు ఇది మన కొరకు చేయబడిన ఏదో ఒకటైయున్నదని కర్మార్థకము చూపిస్తుంది. క్రైస్తవుడు **దేవుని సంపూర్ణతతో నిండుగా నింపబడవలెననునది** వాని ధ్యేయమై యుండవలెనని "యందు" *(eis)* అను పదము సూచిస్తుంది. ఈ పదజాలము కేవలము దేవుడు మనకనుగ్రహించు కృపాసహితమైన వరములను మాత్రమే కానీ ఆయన ఏమైయున్నాడో దానంతటిని సూచిస్తుంది. అనగా, క్రైస్తవునిలో దేవుడే నిండుగా నింపబడి యుండవలెనని పౌలు చేయుచున్న విన్నపమై యున్నది.

పౌలు ఎఫెసీయుల గూర్చి చేయుచున్న ముక్కోణపు విన్నపము, సంఘముగా, దేవుని ప్రణాళికను మరియు ఉద్దేశమును వారు ఇతరులకు తెలియజేయగలుగుటకు వారికి సహాయకరముగా నుండునట్లు రూపింపబడింది. వారు దైవీకముగా శక్తి కలిగింపబడినవారై యున్నారు గనుక, దేవుని ప్రేమ చేత ప్రోత్సాహింపబడినారు గనుక, మరియు దేవుని స్వభావమును వారి జీవితముల ద్వారా బయలుపర్చారు గనుక వారు సఫలీకృతులు కాగలరు.

## స్తుతి (3:20, 21)

**20-21మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగువాటన్నిటికంటెను, ఊహించువాటన్నిటికంటెను అత్యధికముగా చేయ శక్తిగల దేవునికి, క్రీస్తుయేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగునుగాక. ఆమేన్.**

**వచనములు 20, 21**. వారు దేవుని ఉద్దేశమును ఇతరులకు తెలియజెప్పునట్లు ఎఫెసీయులకు అందుబాటులో నుండిన శక్తి గూర్చి పౌలు ఆలోచన చేస్తూ, ఆయన దేవునికి ఒక స్తుతిగీతమును లిఖించాడు. ఈ వచనము **శక్తి గల** దేవుని గూర్చి చెప్పుచున్నది, ఇదే వ్యక్తీకరణము రోమీయులకు 16:25లోను యూదా పత్రిక వచనములు 24, 25 లోను అగుపిస్తుంది.

దేవుని సామర్థ్యము ఈ పత్రికయందంతటను గుర్తింపబడింది. పౌలు ఎఫెసీయుల

కొరకు చేసిన మొదటి విన్నపములో, వారు "విశ్వసించు మన యందు ఆయన చూపుచున్న తన శక్తి యొక్క అపరిమితమైన మహాత్మ్యమెట్టిదో" తెలిసికొనవలెనని ఆయన దేవుని అడిగాడు (1:17-19). ఈ విన్నపము మరియు 3:14-21లోని ప్రార్థన మరియు స్తుతిగీతమునకు మధ్య, దేవుడు తన "శక్తిని" ప్రదర్శించిన వివరాన్ని పౌలు బయలుపర్చాడు.

"శక్తి గల" అను పదజాలమ *dunamai* అను గ్రీకు క్రియా పదమునకు అనువాదమై యున్నది మరియు "ఒకరికి గల సొంత సామర్థ్యము ఆధారంగా, శక్తి కలిగియుండుట" అని అర్థమిచ్చుచున్నది.[13] దేవుని బలము ఆయనలో నుంచే ఉత్పన్నమౌతుంది ... **కంటెను అత్యధికముగా చేయగల** అను పదజాలమునకు "అన్నిటికి పైగా, మించి చేయగల" అనునది అక్షరార్థమై యున్నది; **మనము అడుగువాటన్నిటి కంటెను ఊహించువాటన్నిటి కంటెను** అత్యధికంగా సాధించుటకు దేవుడు శక్తి కలిగియున్నాడు. పౌలు దృవీకరించుచున్న విషయం ఈ క్రింది విధంగా ఉన్నది: వారు చేయుచుండు ప్రార్థనలలో క్రైస్తవులు ఆయనను అడుగువాటన్నిటిని చేయుటకు దేవుడు శక్తిగలవాడై యున్నాడు; ఆయనను అడుగుటలో మనము విఫలులమవుతూనే ఆశతో ఆలోచించే విషయాలను సహితము చేయుటకు ఆయన శక్తిగలవాడై యున్నాడు; మనము అడుగువాటన్నిటి కంటెను ఊహించువాటన్నిటి కంటెను చేయుటకు ఆయన శక్తిగలవాడై యున్నాడు; మనము అడుగువాటన్నిటిని ఊహించువాటన్నిటిని మించి అపరిమితముగా ఎక్కువ సమృద్ధిగా చేయుటకు ఆయన శక్తిగలవాడై యున్నాడు.[14] మనము ఊహించుదానంతటిని అధిగమించియున్న దేవుని ఈ "శక్తి" ఇప్పుడు **మనలో కార్యసాధకమౌతుంది**.

**వచనములు 20, 21.** గ్రీకు గ్రంథ పాఠములో **మహిమ**కు ముందు ఒక ఉపపదము ఉన్నది, ఈ మహిమ – "ఇదే మహిమ" (నొక్కివక్కాణింపబడుచున్నది) – "ఆయనకు మన ద్వారా కలుగవలసి యున్నదని" అది సూచిస్తుంది.[15] సందర్భము, 14-21 వచనములతో సహా, మహిమ పొందువాడు తండ్రియైన దేవుడని విశదపర్చుచున్నది. "మహిమ," (*doxa*) అను గ్రీకు పదము నుండి ఉత్పన్నమైన మాటయై యున్నది మరియు "మహిమపర్చుట, గుర్తించుట, ఘనపర్చుట, స్తుతించుట" అని అర్థమిచ్చుచున్నది.[16] దేవునికి చెందవలసి యున్న స్తుతి **సంఘములో**, క్రీస్తు శరీరములో (1:22, 23), సమాధానపరచబడినవారి చేత (2:16), రక్షింపబడిన చేయుచున్నందుకు సభ్యులంతా చేరి వారి హృదయాంతరాళములో నుండి దేవునికి స్తుతి సంకీర్తనములను సమర్పించుకొనుచు ఆయనను ఆరాధించుచున్న సంఘమై యున్నది. ఈ స్తుతి **క్రీస్తు యేసు మూలముగా**, అనగా సంఘమునకు శిరస్సు మరియు సంఘము జీవించుచు పనిచేయుచుండు పరిధియైయున్న వాని మూలముగా(5:23) కూడ జరుగుచున్నది.

**తరతరములు సదాకాలమను** ఈ పదజాలము వ్యాఖ్యాన కర్తలకు కొంత కష్టము కలిగించింది. "తరతరములు" (ఈ పదము సర్వసాధారణంగా అదే సమయంలో, బహుశా, ముప్పది సంవత్సరముల వ్యవధిలో జీవించుచుండిన ప్రజల గూర్చిన ప్రస్తావనయై యున్నది) మరియు "సదాకాలము" అని కలిపి పేర్కొనుటలో పౌలు భావమేమై యుండిందో? దేవుడు తన సంకల్పమును నెరవేర్చు నిమిత్తము చేసిన సమస్త కార్యములనుబట్టి దేవుని ప్రజలు, సంఘము, సకాలంలో ("సకల తరములలో") మరియు నిత్యత్వములో ("సదాకాలము") దేవుని స్తుతిస్తారనునది అసలు విషయమై యున్నట్లు అగుపిస్తుంది. "మహిమ

సంఘములోను, క్రీస్తులోను, చరిత్రలోను మరియు నిత్యత్వములోను దేవునికే చెందుతుందను వాస్తవము పాఠకమహాశయులు వారి 'ఆమేన్' అను పలుకుట చేత రూఢిపరచబడవలసినదై యున్నది."[17]

**ఆమేన్** అను పదముతో, పౌలు ఆయన వ్రాయుచుండిన పత్రికలోని మొదటి సగ భాగమును పూర్తిచేయుచున్నాడు. క్రీస్తు మరియు సంఘము నందలి దేవుని నిత్య సంకల్పము గూర్చి ఆయన రచించాడు, ఎఫెసీయులు దేవుని ఉద్దేశము గూర్చి లోతైన అవగాహన కలిగియుండవలెనని వారి కొరకు ప్రార్థించాడు, దేవుని సంకల్పమునకు వెలుపల ఉన్నవారిని వర్ణించాడు, ఈ సంకల్పము దేవుని చేత ప్రారంభించబడి క్రీస్తు చేత నెరవేర్చబడిందని చూపించాడు, దేవుని సంకల్పము తేటపరచబడిన ఒక మర్మమై యుండిందని సూచించాడు. స్తుతి గీతమును ముగింపునకు తెచ్చిన "అమేన్"తో, పౌలు పత్రికను చదువుచున్న పాఠకులు దేవుని సంకల్పమును గూర్చిన ఆచరణాత్మక అన్వయము కొరకు సిద్ధంచేయబడ్డారు, గనుక సంకల్పము ప్రకారం సంఘం ఇప్పుడే, ఇచ్చటే కలిగియుండు దాని నానావిధ సంబంధములలో జీవించాల్సిన విధానం అదే అయియుండింది. ఈ సంబంధములు ఎఫెసీయులకు వ్రాయబడిన ఈ పత్రికలోని రెండవ భాగంలో కలవు.

## అన్వయము

### దేవుని శక్తిని విడుదల చేయుట (3:14–21)

పౌలు ప్రార్థనాపరుడై యుండెను. ఆయన రహస్యముగా చేయుచుండిన ప్రార్థనలు మనము వినగలుగునట్లు తన ఉత్తరముల ద్వారా అవకాశమిస్తున్నాడు, గనుక అతని ప్రార్థనా జీవితము యొక్క గంభీరమైన లోతుల గూర్చి మనము ఏదో ఒకటి నేర్చుకొనగలము.

మనము 3వ అధ్యాయం ముగింపుకు చేరుకొనుచుండగా, ఆయన ప్రార్థించుచుండిన అవసరముల గూర్చి పౌలు ఇదే ఉత్తరంలో రెండవ సారి తెలియజెప్పుచున్నాడు. 1:15–23లో, అవగాహన గూర్చి ఆయన ఆందోళన చెందుచుండెను; ఇచ్చట అట్టి అవగాహనను సద్వినియోగము చేసికొనుట గూర్చి ఆందోళన చెందుచున్నాడు. అంతకు మునుపు. దేవుని యెదుట వారి స్థానమేమిటో ఎఫెసీయులు తెలుసుకొనవలెనని ఆయన ప్రార్థించాడు. ఇప్పుడు ఆ స్థానము వలన ప్రాప్తించు శక్తిని వారు అనుభవించాలని ప్రార్థిస్తున్నాడు.

దేవుడు ప్రతి క్రైస్తవుని జీవితంలోనికి ఆధ్యాత్మిక శక్తిని విడుదల చేయవలెనని పౌలు దేవుని వేడుకొన్నాడు, సరికదా ఆ శక్తి దేవుని మహదైశ్వర్యమునకు సరిపడు సముచితమైన నిష్పత్తిలో (అక్షరాలా, మహదైశ్వర్యము "చొప్పున" "మహదైశ్వర్యములో నుండి" కాదు) ఉండాలని ఆశించాడు. దేవుడు ఎంత ఐశ్వర్యవంతుడు? నీకెప్పుడైనాగాని అవసరమై యుండు వాటన్నిటి కంటే ఐశ్వర్యవంతుడై యున్నాడు! దేవుడు మన నిమిత్తమైన ఆధ్యాత్మిక శక్తిని అపరిమితమైన మొత్తములో కలిగియుండి, దానిని ఎప్పుడు విడుదల చేయుదునా యని వేచియున్నాడు!

దేవుని శక్తి జీవితాల్లోనికి సంపూర్ణ విస్తృతిలో విడుదల గావింపబడునట్లు మనము దేవునితో ఎలా సహకరించగలము? పౌలు ప్రార్థనకు ప్రత్యుత్తరము రావాలంటే క్రైస్తవుని

జీవితంలో అనేక గుణగణాలుండవలెను.

*సంఘర్షణలు పరిష్కరించుటకు అంతరంగమందలి బలము* (3:15–18). సేవచేయుటకు అవసరమైన శక్తి కొరకు పౌలు ఇచ్చట ప్రార్థించుచుండలేదు. దాని కొరకు అటుతరువాత ప్రార్థించాడు. విశేషంగా, ఎఫెసీ క్రైస్తవులు సంఘర్షణలు పరిష్కరించుకొనగలుగుటకు వారి అంతరంగ పురుషునిలో బలవంతులై యుండవలెనని వారి కొరకే పౌలు ప్రార్థించాడు. ఆధ్యాత్మిక జీవిత అసలు పోరాటం వెలుపటి కంటె ముందు అంతరంగములో పోరాడబడవలసి యుండును.

ఈ సమస్య గూర్చి పౌలు స్వయంగా ఎరిగియుండెను (రోమీయులకు 7వ అధ్యాయం చూడుము). తన అంతరంగములో ఏది సరైనదో దానినే ఆయన చేయదలచాడు, కానీ ఆయన చేయగోరని చెడునే చేయుచుండెను. ఆయనలో సరైన కోరికలుండినవి, కానీ వాటిని నెరవేర్చుటకు అంతరంగ పురుషుడు బలహీనుడై యుండెను. అందుచేతనే ఆయన రోమీయులకు 7:24, 25లో, "అయ్యో, నేనెంత దౌర్భాగ్యుడను? ఇట్టి మరణమునకు లోనగు శరీరము నుండి నన్నెవడు విడిపించును? మన ప్రభువైన యేసు క్రీస్తు ద్వారా దేవునికిని కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను!" అని కేక వేసాడు.

రోమీయులకు 8వ అధ్యాయంలో, దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుటకు గల ఒక కారణమును ఆయన తెలియజెప్పుచున్నాడు. క్రైస్తవుల జీవితంలో పరిశుద్ధాత్మ పనిచేయు విధాన రహస్యమును ఆయన కనుగొన్నాడు: "శరీరము ననుసరింపక **ఆత్మ** ననుసరించియే నడుచుకొను మనయందు ధర్మశాస్త్ర సంబంధమైన నీతి విధి నెరవేర్చబడవలెనని ..." (వచనములు 3, 4).

మనము దేవుని ఆత్మకు లొంగిపోయి శక్తివంతమైన ఆయన బలముతో జీవించనంత వరకు మనము మన అంతరంగ పురుషుని యందు ఓటమి పాలౌతూనే ఉంటాము. మనము తిరిగి జన్మించినప్పుడు, మనకు దేవుని ఆత్మ అనుగ్రహింపబడెను (అపొస్తలుల కార్యములు 2:38) గనుక మన దేహములు పరిశుద్ధాత్మకు ఆలయములయ్యాయి (1 కొరింథీయులకు 6:19). ఆయన మన అంతరంగములో నివసించుచున్నప్పటికిని, మనము ఆయనకు లొంగిపోవు పరిమాణము కంటె ఎక్కువ పరిమాణములో బలమును ఆయన మనకీయడు.

మనము మన జీవితములను మన ఎరుకతోనే ఎలా పరిశుద్ధాత్మ అధీనమునకు అప్పగించగలము? మన మనస్సులు ఆయన వాక్యముతో, అనగా పరిశుద్ధాత్మ యొక్క నిర్వహణా నియమ సంపుటితో నింపబడి యుండవలెను. కొలొస్సయులకు 3:16 "... క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింప నియ్యుడని" సెలవిచ్చుచున్నది. మనము మన ఆత్మలను ఆ వాక్యముతో ముంచెత్తవలసి యున్నది. "నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యమును ఉంచుకొని యున్నానని" కీర్తనాకారుడైన దావీదు సెలవిచ్చుచున్నాడు (కీర్తనలు 119:11).

*క్రీస్తుతో ప్రగాఢమైన సంబంధము* (3:14–21). వారి జీవితాల్లో మరొక వాస్తవము అనుభవింపబడునట్లు క్రైస్తవులు అంతరంగమందు బలమును అనుభవించవలెనని పౌలు వారి కొరకు ప్రార్థించాడు.

నిశ్చయముగా, ఈ ప్రజలు హృదయాల్లో క్రీస్తు అదివరకే నివసించుచుండెను, ఏలయనగా పౌలు వారిని "పరిశుద్ధులు" అని అదివరకే సంబోధించాడు (1:1). వారు

క్రీస్తుతో కూడ ప్రగాఢమైన సంబంధము కలిగియుండవలెనని ఆయన కోరుచుండెను. వారు యేసుతో కూడ సహవాసము కలిగియుండవలెనని ఆయన ఆశించాడు, అప్పుడు యేసు వారి హృదయాలలో సింహాసనాసీనుడై కదలకుండును.

యేసు తన శిష్యులతో, "ఒకడు నన్ను ప్రేమించిన యెడల, వాడు నా మాట *గైకొనును*; అప్పుడు నా తండ్రి వానిని ప్రేమించుచు, మేము వాని యొద్దకు వచ్చి వాని యొద్ద నివాసము చేతుమని" చెప్పాడు (యోహాను 14:23). యేసు మన హృదయములో నివసించాలంటే దానికి విధేయత కీలకమైనదై యున్నది. రాజు ఎవరి హృదయములోనైతే భద్రముగా తన సింహాసనముపై ఆసీనుడై యుంటాడో, వారి జీవితాల్లో తన శక్తిని సంపూర్ణ పరిమాణములో ప్రయోగించుటకు ఆయన స్వేచ్ఛాపరుడై యుంటాడు.

*ఇతరుల యెడల ప్రేమ* (3:19). దేవుని స్వభావమునకు గల బండగుర్తు, ప్రేమ. మన జీవితములను తన అధీనం ప్రకారం ఏలుటకు క్రీస్తు మన హృదయములలో నివసించినప్పుడు, మనము ఇతరుల యెడల ఆయన ప్రేమను ప్రదర్శిస్తాము. మనము మన పొరుగువారితో సత్యమును పంచుకొనునట్లు మనలను ప్రేరేపించునది, ప్రేమే, దొంగ యికమీదట దొంగతనము చేయకుండా వానిని నిలువరించేది, ప్రేమే. క్రైస్తవుడు జారత్వమును మానుకొనునట్లు చేసేది, ప్రేమే. భార్య తన భర్తకు లోబడునట్లు చేసేది, ప్రేమే. భర్త తన సొంత శరీరమునకు వలె భార్య యెడల తగు శ్రద్ధ వహించునట్లు చేసేది, ప్రేమే.

మనము క్రైస్తవులమని సాధికారంతో చెప్పుకొనుచునే, మన జీవన శైలి యొక్క పునాది ప్రేమయై యుండనట్లయితే, క్రీస్తు మన హృదయాలలో నివసించుటలేదని అర్థము. మనము **ఆత్మా**నుసారంగా నడుచుకొనినప్పుడు, ఆయన ఒక నిశ్చయమైన ఫలమును మనలో ఉత్పన్నము చేయునని గలతీయులకు 5:22, 23 సెలవిచ్చుచున్నవి – వాటిలో మొట్టమొదట పేర్కొనబడినది, ప్రేమే. యేసు మన హృదయాల్లో తన సొంత గృహములో నివసిస్తున్నట్టుగా నివసించినప్పుడు, మన ఆలోచనలు, చర్యలు, మరియు నోటిమాటల్లో ఆయన ప్రేమ దానంతట అధి వ్యక్తమగుట మొదలౌతుంది.

మనము ప్రేమలో వేరు పారి స్థిరపడినప్పుడే క్రీస్తు ప్రేమ ఎంత అపరిమితమైనదో అర్థమగుట ఆరంభమౌతుంది. క్రీస్తు ప్రేమ ఎంత వెడల్పైంది? సమస్త మానవులను ఆలింగనము చేసుకొని అందరిని ఒక్కటి చేయనంతటి వెడల్పైనదై యున్నది. ఆయన ప్రేమ ఎంత పొడవైంది? అది పూర్వ నిత్యత్వంలో మొదలయ్యింది గనక భవిష్యత్ నిత్యత్వం వరకు కొనసాగుతుంది; అది ఎన్నడును ఆగిపోదు. ఆయన ప్రేమ ఎంత లోతైంది? అది ఘోరాతి ఘోరమైన పాపిని సహితము నీచాతినీచమైన పాపపు గుంటలో నుండి పైకి లేవదీయనంతటి లోతైనదై యున్నది. ఆయన ప్రేమ ఎంత ఎత్తైంది? మనము క్రీస్తుతోనే కలిసి దేవుని కుడి పార్శ్వమున కూర్చుండునట్లు మనలను పరలోక స్థలము వరకు పైకెత్తునంతగా ఎత్తైనదై యున్నది.

క్రీస్తు ప్రేమ వానికి చేరువగా చేరలేనంతటి దూరంలో ఒక్కడైనను లేడు. మనము ఆ విధమైన ప్రేమను అనుభవించుటకు ఆరంభించినప్పుడు, మన జీవితాల్లో దైవీకమైన శక్తిని విడుదల గావించు దిశగా పయనిస్తున్నామని అర్థం.

*దేవునితో నింపబడి యుండుట* (3:19). ఎంత అపురూపమైన ఆలోచనగల

మాటలు కదా! ఆయన అందరిని నింపు దేవుడు మరియు సమస్తము మనలను నింపవలెనని కోరుచున్నది ... ఆయన వచ్చి మనలో నివసించాలని ఆశిస్తున్నాడు! ఆయన వైఖరులు, ఆయన శీలము, ఆయన మూర్తిమంతము మనలను నింపవలెనని ఆయన ఆశిస్తున్నాడు.

మనము యేసుతో నింపబడినప్పుడు, దేవుని సకల సంపూర్ణత మనయందున్నదని అర్థం. దేవుడు ప్రేమయై యున్నాడు గనుక, దేవునితో నిండుగా నింపబడియున్న క్రైస్తవుడు దేవుని ప్రేమను వ్యక్తము చేస్తుంటాడు. దేవుడు కనికరముగలవాడు గనుక, దేవుని సకల సంపూర్ణతను అనుభవించు క్రైస్తవుడు ఇతరుల యెడల కనికరమును కనుపరుస్తుంటాడు. దేవుడు పరిశుద్ధుడు గనుక, దేవునితో నింపబడియున్న క్రైస్తవుడు వాని దైనందిన జీవితంలో దైవభక్తిపూర్వకమైన పరిశుద్ధతను ప్రదర్శిస్తుంటాడు.

దేవుని సకల సంపూర్ణతను అనుభవించుట అనగా, మనలో కొంతమేరకైనా, దేవుని గుణగణాలున్నాయని అర్థము, గనుక క్రీస్తు శరీరములోని ఒక భాగముగా మనము దేవుడు ఏమైయుండునో దానిని ప్రతిబింబిస్తాము. మనము దైవభక్తిలేని సమాజము యెదుట యేసు స్వరూపమును ప్రతిబింబించినప్పుడు, దేవుడు తన దైవీకమైన శక్తిని మన ద్వారా విడుదల గావిస్తాడు.

*మన జీవితములకు అవసరమైన శక్తి* (3:20). దేవుడు మరియు ప్రతి క్రైస్తవునికి అందుబాటులో నుండుట కొరకు దేవుడు కలిగియున్న శక్తిని వర్ణించుటకు పౌలుకు విశేషణములు లభించుట లేదు.

> *చేయ శక్తిగల* దేవునికి ...
>
> *మనము అడుగువాటన్నిటిని* చేయ శక్తి గల దేవునికి ...
>
> మనము *అడుగువాటన్నిటిని మరియు/లేదా ఊహించువాటన్నిటిని* చేయ శక్తిగల దేవునికి ...
>
> మనము అడుగువాటన్నిటికంటెను ఊహించువాటన్నిటికంటెను *అధికముగా* చేయ శక్తి గల దేవునికి ...
>
> మనము అడుగువాటన్నిటికంటెను ఊహించువాటన్నిటికంటెను *అత్యధికముగా* చేయ శక్తి గల దేవునికి ...
>
> మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున ...

మనము మన సొంత బలము మరియు శక్తితో నడుచుకొనుచుండవలెనని దేవుడు కోరుట లేదు. మనలను ఏర్పరచుకొని, విమోచించి, మరియు ముద్రించినవాడు, ఆధ్యాత్మిక మరణములో నుంచి మనలను లేపి దేవుని కుడి పార్శ్వమున కూర్చుండబెట్టినవాడు మనము జీవితమును ఎదుర్కొనునట్లు మనకు అవసరమైయున్న శక్తిననుగ్రహించుట ద్వారా ఆయన మొదలుపెట్టిన కార్యమును సంపూర్తిచేస్తాడు. ఇందుకు పరిమితేమీ లేదు! మన జీవితములకు అవసరమై యున్న ఆయన శక్తి అపరిమితమైనది.

*ముగింపు.* ఆయన తరగని తన శక్తిని మన జీవితాల్లో ఎందుకు ఉంచును? "దేవునికి, క్రీస్తు యేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగునుగాక. ఆమేన్" (3:20, 21). దేవుడు మహిమపరచబడవలెనని కోరుచున్నాడు. ఆయన నిజముగా ఎంత మంచివాడో, ఎంత గొప్పవాడో ప్రజలు తెలిసికొనవలెనని ఆయన ఆశిస్తున్నాడు.

ఆయన శక్తి సంఘ జీవితములో కార్యసాధకమగుచున్నట్లు కనబడినప్పుడు, అట్టి మహిమ ఆయనదే ఔతుంది.

క్రిస్ బుల్లార్డ్

---

సూచనలు

[1]Ethelbert W. Bullinger, *A Critical Lexicon and Concordance to the English and Greek New Testament* (London: Samuel Bagster and Sons, n.d.; reprint, Grand Rapids, Mich.: Zondervan Publishing House, Regency Reference Library, 1975), 836. [2]Ibid., 769. [3]Kenneth S. Wuest, *Wuest's Word Studies from the Greek New Testament for the English Reader: Ephesians and Colossians* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1953), 88. [4]S. D. F. Salmond, "The Epistle to the Ephesians," in *The Expositor's Greek Testament*, ed. W. Robertson Nicoll (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1967), 3:314. [5]Andrew T. Lincoln, Ephesians, Word Biblical Commentary, vol. 42 (Dallas: Word Books, 1990), 206. [6]Bullinger, 347. [7]Ibid., 175. [8]Lincoln, 208–14. [9]Bullinger, 436. [10]Lincoln, 214.

[11]Wuest, 90. [12]Lincoln, 213. [13]Spiros Zodhiates, ed., *The Complete Word Study New Testament*, 2d ed. (Chattanooga, Tenn.: AMG Publishers, 1992), 907. [14]Lincoln, 216. [15]R. C. H. Lenski, *The Interpretation of St. Paul's Epistles to the Galatians, to the Ephesians and to the Philippians* (Columbus, Ohio: Wartburg Press, 1946; reprint, Minneapolis: Augsburg Publishing House, 1961), 500. [16]Zodhiates, 907. [17]Lincoln, 218.